క్లుప్తంగా

రాపల్లి శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నిజామాబాద్‌నాగారం: రిటైల్ దుస్తుల గుమస్తాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మేడే శ్రమశక్తి పురస్కారం అందుకున్న జిల్లా కేంద్రానికి చెందిన రాపల్లి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కొన్నేళ్లుగా కార్మిక సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నందున ప్రభుత్వం శ్రీనివాస్‌కు శ్రమశక్తి పురస్కారం అందించిందని సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జాడె సంతోష్, వైరాజు, న్యాలపల్లి శ్రీనివాస్, మూడ రవి, రాజేశ్వర్, అరవింద్, లక్ష్మణ్, కోట్ కర్ శంకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం

డిచ్‌పల్లి: మండలంలోని బర్దిపూర్ శివారులోని బృందావన్ గార్డెన్స్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ రూరల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హాజరవుతారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయమై పార్టీ కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాల సేకరణ ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ, నిజామాబాద్ రూరల్, మోపాల్, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పెన్షనర్లు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న పెన్షనర్స్ భవనంలో జిల్లా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ సమస్యలపై ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సభ్యులు పలు తీర్మానాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పెన్షన్ విధానం, 8వ వేతన సవరణ, జిల్లాలో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై అసోసియేషన్ బాగోగులు, వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై చర్చలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, షేక్‌హుస్సేన్, మదన్‌మోహన్, కృష్ణారావు, భూపతిరెడ్డి, సి సుదర్శన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న సభ్యులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం నడిపల్లి జీపీ పరిధిలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో శ్రీదాసాంజనేయ ఆలయ నిర్మాణ పనులకు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయం పాతబడటంతో పక్కనే నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

8న హైదరాబాద్‌లో రైతు ధర్నా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరికొండ: రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 8న రైతు ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు నారాగౌడ్ తెలిపారు. మండలంలోని గడ్కోల్‌లో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకుంటున్నామని చెప్పి వాటిని జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన చట్టం బిల్లు పేరుతో మళ్లీ కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రైతు ధర్నాను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. నాయకులు లింబాద్రి, సాయారెడ్డి, కట్ట రాములు, రమేశ్, రాములు, కిశోర్, బాల్‌రెడ్డి, ఎర్రన్న, భూమన్న, అనీస్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

గురువు చేతిలోనే విద్యార్థుల భవిష్యత్తు



క్యాంప్ కార్యాలయంలో విద్యార్థిని క్రితిని సన్మానిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



పడకల్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

- పేద విద్యార్థులకు అండగా ఉంటా
- ఎస్సెస్సీ స్టేట్ టాపర్‌ను సన్మానించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: విద్యార్థులను దేశం గర్వించేలా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 596 మార్కులు సాధించిన ఎస్ క్రితిని ఎమ్మెల్యే ఆదివారం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలవాలని విద్యార్థినిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా విద్యార్థిని రాష్ట్రస్థాయిలోనే అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల, తల్లిదండ్రులు, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిందని కొనియాడారు. ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్ గుప్త చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నామని అన్నారు. పేద విద్యార్థుల చదువులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు, ప్రిన్సిపాల్ రణదీశ్, డాక్టర్ రాఘవేంద్ర చిద్రవార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ టాపర్లకు సన్మానం

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పడకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కూర శ్రీజ(575), కుంటొల్ల సింధు(567), అర్పిత (563), రచన (562) మార్కులు సాధించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేందర్‌రెడ్డి, పీఈటీ శ్రీనివాస్, వీడీసీ సభ్యులు బండారి నాగేశ్, తిరుపతి, రాజేశ్వర్‌గౌడ్, రవి, పవన్, భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'నీట్' ప్రవేశ పరీక్ష

- తెయూలో 28 మంది గైర్హాజరు



తెయూలో విద్యార్థిని హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న ఎస్సై ఎండీ షరీఫ్



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 456 మంది అభ్యర్థులకు 438 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కేంద్రంలో 384 మంది అభ్యర్థులకు 374 మంది హాజరు కాగా 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల లోపు అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. కాగా, అభ్యర్థులు అడ్మిట్ కార్డుతోపాటు దానిపై అతికించేందుకు ఒక ఫొటోను వెంట తీసుకురాకపోవడంతో అధికారుల సూచన మేరకు సమీపంలోని డిచ్‌పల్లి మండల కేంద్రానికి వెళ్లి పాస్‌పోర్టు సైజ్ ఫొటో దిగి తిరిగి పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ సిబ్బందితో కలిసి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను నిజామాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్ పరిశీలించారు.

సేవలు మరింత విస్తృతం చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ఉదయసూర్యభగవాన్

నిజామాబాద్ నాగారం: లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలని, ప్రజలకు అవసరమయ్యే సేవలను అందించాలని రీజియన్ చైర్మన్ ఉదయ సూర్యభగవాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా–230డీ రీజియన్ 5వ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త సభ్యులను చేర్పించడం, నూతన క్లబ్‌లు ఏర్పాటు చేయడం, ఎన్నుకోబడిన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు ఈనెల 21, 22వ తేదీల్లో తూంకుంటలో శిక్షణ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వపు గవర్నర్ వీరేశం, డి యాదగిరి, పి లక్ష్మీనారాయణ, కరిపె రవీందర్, ద్వారకాదాస్ అగర్వాల్, ఎం శంకర్, బి నరసింహారావు, దారం భూమన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



ధర్మారంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి)లో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలను వేదపండితులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీదేవీ భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలో ఉన్న సత్యనారాయణ స్వామి, విజయగణపతి–నవగ్రహాలు, ఉమామహేశ్వరస్వామి, అభయ ఆంజనేయస్వామి, శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి, సంతాన నాగేంద్ర స్వామి ఆలయాల వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సత్యనారాయణ స్వామికి అభిషేకం, వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలను పండితులు బ్రహ్మశ్రీ వేలేటి పశుపతి శర్మ, బ్రహ్మశ్రీ ఉమామహేశ్వర శర్మ, దేవాలయ ప్రధానార్చకులు రాహుల్ త్రిపాఠి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. వేడుకల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు రావుల బ్రహ్మానందం, నాయుడు ఆంజనేయులు, నాగార్జున, సుబ్బారావు, శ్రీనివాస్, వేంకటేశ్వర రావు, కేశవులు, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాంక్ కాలనీలో సీతారాముల..



పూజా కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌రూరల్: నగరంలోని బ్యాంక్ కాలనీ వద్ద భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ అభివద్ధి కమిటీ అధ్యక్షుడు ఎం నారాయణరెడ్డి సౌజన్యంతో ఉదయం నిత్యారాధన హవనం, మహా పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠ ఆరాధన మహోత్సవం, స్వామి వారి కల్యాణాన్ని పండితులు ఘనంగా చేపట్టారు. పూజా కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంతన్

సిరికొండ: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి శంతన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. 2023 జూలై నుంచి పీఆర్సీ అమలు చేయాలని, గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల సెలవులు ఎక్కువగా ఉన్నాయంటు సీఎం మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇతర ఉద్యోగులకు ఏడాదికి ముప్పై రోజులు సంపాదిత సెలవులు ఇస్తారని, ఉపాధ్యాయులను వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా ప్రకటించినందున ఏడాదికి ఆరు రోజులు మాత్రమే సెలవులు ఇస్తారని, ఈ విషయం తెలుసుకోకుండా చట్టసభల్లో సీఎం స్థాయిలో మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించడం అవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం బాలయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

నిజామాబాద్ రూరల్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఈ నెల 6న తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సంఘ భవిష్యత్తుపై కార్యాచరణ ఉంటుందని, సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న కాలనీవాసులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని అశోక్‌నగర్‌లో మాల సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. సంఘంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోటార్ గంగాధర్, కోశాధికారిగా సక్కి విజయ్ కుమార్, సెక్రటరీగా సుంకరి భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాడె సాయిలు, మాడె శ్రీనివాస్, సక్కి సురేశ్, సక్కి ప్రభంజన్, డాక్టర్ సాయిలు, శ్రవణ్, గైని శ్రీనివాస్, వీరేశం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి



శ్రామికనగర్‌లో ఎర్ర జెండాను ఎగురవేసిన నాయకులు

మోపాల్: శ్రమజీవుల ఐక్య పోరాటాలతోనే శ్రమకు తగ్గ ఫలితాలు సాధించుకోవచ్చని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పరుచూరి శ్రీధర్ అన్నారు. మే డే వారోత్సవాల్లో భాగంగా నగర శివారులోని బోర్గాం(పి) శ్రామికనగర్‌లో ఎర్రజెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరుచూరి శ్రీధర్ మాట్లాడుతూ.. శ్రమజీవుల చెమట రక్తంతోనే దేశాలు, పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయని, గుండు సూది నుంచి విమానం వరకు శ్రమ లేనిదే ఏ వస్తువు కూడా ఉత్పత్తి కాదని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది శ్రమిస్తే.. అతి తక్కువ మంది లాభపడుతున్నారని, శ్రమకు తగ్గ ఫలితం కార్మికులకు అందడంలేదన్నారు. ప్రజల ఐక్యతను దెబ్బతీయడానికి నేడు దేశంలో కుల, మత, ప్రాంతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని, వీటిని ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేల్పూరు భూమయ్య, నీలం సాయిబాబా, రమేశ్, జన్నారపు రాజేశ్వర్, మల్లికార్జున్, నతన్, దండెం పోచయ్య, మల్లేశ్, నిర్మల, కొమ్ము లక్ష్మి, ఎలిశమ్మ, కరుణాకర్, కొంగరి బాబు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ముగిసిన రోటరీ క్లబ్ శిక్షణ

డిచ్‌పల్లి: రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల రెండు రోజుల శిక్షణ తరగతులు ఆదివారం ముగిసినట్లు క్లబ్ అధ్యక్షుడు పద్మ శ్రీనివాస్ తెలిపారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3150 పరిధిలోని వివిధ జిల్లాలకు చెందిన 39 రోటరీ క్లబ్ లకు సంబంధించి ఎలెక్టెడ్ అధ్యక్ష, కార్యదర్శులకు వారి విధులు, నాయకత్వ లక్షణాలు, సమాజసేవ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, సీనియర్ సభ్యులు అవగాహన కల్పించారు. సమాజ సేవలో రోటరీ సభ్యులకు స్ఫూర్తిగా నిలిచి, మే 13న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న పీడీజీ డాక్టర్ రవి వడ్లమానిని రోటరీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్, ప్రస్తుత గవర్నర్ డాక్టర్ శరత్ చౌదరి, తల్లా రాజశేఖర్ రెడ్డి, మల్లిక్, అనిత, బిబో శ్రీనివాస్, గౌరీ శంకర్, రంజిత్ సింగ్ ఠాకూర్, సృజన్ రెడ్డి, గిరీశ్ కుమార్, నాగరాజు, 39 రోటరీ క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన డాక్టర్ రవిని సన్మానిస్తున్న ప్రతినిధులు

12 మండలాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

సుభాష్‌నగర్: భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లాలోని 12 మండలాలకు నూతనంగా మండల అధ్యక్షులను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లోని 12 మండలాలకు అధ్యక్షులను రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం నియమించామన్నారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయన్నారు.

మండలం	అధ్యక్షుడి పేరు
బోధన్ రూరల్	స్కిర్ర సుదర్శన్
నవీపేట్	ద్యాగ సరిన్
సాలూర	రావుబా గంగాధర్
బోధన్ మున్సిపాలిటీ	పసులోటి గోపి కిషన్
బాల్కొండ	అంబటి నవీన్‌కుమార్
వేల్పూర్	బేల్దారి నవీన్
కమ్మర్‌పల్లి	బద్దం రమేష్‌రెడ్డి
భీంగల్ రూరల్	ఆరె రవీందర్
మోర్తాడ్	తాతగారి శివానంద్
మెండోరా	మార ముత్తెన్న
ముప్కాల్	గడ్డం సంతోష్‌రెడ్డి
ఏర్గట్ల	నాయకుడు గంగాధర్

నృత్య పోటీలలో కమ్మర్‌పల్లి కళాకారిణుల ప్రతిభ



జ్ఞాపికలతో కమ్మర్‌పల్లి కళాకారిణులు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పరమేశ్వర కళానిలయంలో శిక్షణ పొందుతున్న కళాకారిణులు ఆదివారం యాదగిరిగుట్టలో నిర్వహించిన నృత్య పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు నాట్య గురువు గంట శిరీష తెలిపారు. తమ కళా నిలయానికి చెందిన సుదీక్ష, భువనేశ్వరి, నమ్రత, లరణ్య, భవ్యశ్రీ, రిషిత, చైత్ర, మితిలాదేవి, మధుశ్రీ, రిషిప్రియ, శివాణి, వన్షిక, మనస్విని, శ్రీలాస్య, అక్షర పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు యాదగిరి లక్ష్మీనృసింహ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేసినట్లు తెలిపారు.

శిక్షణాతరగతులకు జిల్లావాసుల ఎంపిక



సందు ప్రవీణ్



పెండోట అనిల్‌కుమార్

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వంలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో మే 5, 6వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే వినియోగదారుల ప్రతినిధుల శిక్షణాతరగతులకు జిల్లా నుంచి సీసీఐ రాష్ట్ర కార్యదర్శి సందు ప్రవీణ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెండోట అనిల్‌కుమార్ హాజరుకానున్నారు. వస్తు సేవల నాణ్యతలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ రూల్స్–2016, బంగారు, వెండి ఆభరణాలపై హాల్ మార్కింగ్ విధానం, కచ్చితంగా అమలు తదితర అంశాలపై రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా బీఐఎస్ రిజిస్ట్రేషన్ ఉన్న వినియోగదారుల ప్రతినిధులు శిక్షణకు హాజరుకానున్నారు. శిక్షణా తరగతుల అనంతరం భారత వినియోగదారుల సమాఖ్య సిల్వర్ జూబ్లీ వేడుకల్లో సందు ప్రవీణ్, పెండోట అనిల్ కుమార్ పాల్గొననున్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	హిట్-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-11.00, 4.40
	రెట్రో-1.30, 7.20, 10.30
స్క్రీన్-3	రైడ్-2(హిందీ)-11.00,1.40,4.30, 10.30
	థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	హిట్-9.50, 1.05, 4.20, 7.35, 10.50
స్క్రీన్-2	రెట్రో-10.10, 4.25, 10.40
	థండర్ బోల్ట్స్(3డీ)-1.35, 7.50
స్క్రీన్-3	రైడ్-2(హిందీ)-10.00, 4.25, 10.50
	రెట్రో-1.00, 7.25
స్క్రీన్ -4	తుడరుమ్-10.15, 1.35
	సారంగపాణి జాతకం-4.55
	రైడ్-2(హిందీ)-7.45 - జింఖానా-10.45

లలితామహల్ రెట్రో — దేవి థండర్ బోల్ట్స్ 2డీ
నటరాజ్ రైడ్-2(హిందీ) — విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,700	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,260	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	50	పచ్చిమిర్చి	35	50
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	8	16
కాకరకాయ	35	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	80
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	30	50

-సుభాష్‌నగర్